క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే కేసులు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

వంగర: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. ఆదివారం వంగర జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. మద్యంసేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనాలను వేగంగా నడపొద్దని సూచించారు.

అగ్నిఅస్త్రంతో కత్తెర పురుగు నివారణ



వంగర: అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వంగర: మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును అగ్నిఅస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.టి.కిరణ్ కుమార్, వెంకటరమణ అన్నారు. మండలంలోని కింజంగి గ్రామంలో ఆదివారం మొక్కజొన్న పంట సాగుచేస్తున్న రైతులకు అగ్ని అస్త్రం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. గోమూత్రం, పొగాకు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, వేపాకులతో అగ్నిఅస్త్రాన్ని ఏవిధంగా తయారు చేయవచ్చో వివరించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పిరిడి గ్రామ కాలువల్లో పూడికతీత పనులుల చేస్తున్న కూలీలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి, పారాది, దిబ్బగుడ్డివలస గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వీధులు, రోడ్లలో ఉన్న చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్నారు. రక్షిత మంచినీటి పథకాల్లో బ్లీచింగ్ చల్లారు.

రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు



చిన్నయ్యపేటలో సీసీరోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీలో రూ.30 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి సంధ్యాశ్రీనివాసరావులు తెలిపారు. సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తుండడంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు



సరసనాపల్లిలో బోరు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, జోడుబందల, ఉనుకూరు, చిన్నశిర్లాం తదితర గ్రామాల్లో పాడైన బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్ తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు స్థానిక సర్పంచ్‌ల సహకారంతో పూర్తిస్థాయిలో బోర్లను బాగుచేయించి ప్రజలకు నీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు.

దుస్తుల వితరణ



దుస్తులు అందుకున్న చిన్నారులతో దాత కృష్ణదాసు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో పలువురు చిన్నారులు, విభిన్న ప్రతిభావంతులకు వనమిత్ర కె.కృష్ణదాసు ఆదివారం దుస్తులు వితరణ చేశారు. ఏటా క్రిస్మస్, సంక్రాంతి పండగ ముందు రోజుల్లో ఇలా పేద వారికి బట్టలు పంపిణీ చేస్తున్నట్లు దాత తెలిపారు.

పెదపోలమ్మ పండగకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పాటు సంబరాలు
- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పల నాయుడు పర్యవేక్షణలో ఏర్పాట్లు
- 9న తొలేళ్ల ఉత్సవం, 10న సిరిమానోత్సవం



సిరిమాను సిద్ధం చేస్తున్న దృశ్యం



ఉత్సవాలకు ముస్తాబైన పెదపోలమ్మ ఆలయం

బొబ్బిలి రూరల్: పెదపోలమ్మ సంబరాలకు మండలంలోని పక్కి గ్రామం సిద్ధమైంది. సోమవారం నుంచి దాదాపు మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఐదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ వేడులను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల వారు తహతహలాడుతుంటారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు స్వగ్రామం పక్కిలోనే ఈ పండగ జరుగుతుండడంతో ఈ ఏడాది పండగ ఎలా చేస్తారా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండడం విశేషం. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు ప్రస్తుతం పండగ ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం తొలేళ్ల ఉత్సవంతో ఆరంభమయ్యే అమ్మవారి సంబరాలు మంగళవారం సిరిమానోత్సవం బుధవారం అనుపోత్సవంతో ముగుస్తుంది. ఆయా రోజుల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తమ మొక్కులు తీర్చుకుంటారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా అంజలి రథం, బళ్ల వేషాలు చూపరులను అలరిస్తాయి.

అమ్మవారి దీవెనలతో..



పెదపోలమ్మ వారి దీవెనలతో ప్రతీసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, పోలీసులు, గ్రామస్తుల సహకారం చాలా బాగుంటుంది. అమ్మ వారి సిరిమాను అధిరోహించడం నా పూర్వ జన్మ సుకృతం. ఈ ఏడాది కూడా ఉత్సవాలు బాగా జరిగేలా అమ్మవారు దీవిస్తారు.

– నక్కా పకీరు, సిరిమాను అధిరోహించే పూజారి, పక్కి

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి



బూసాయవలసలో ఇంటింటికీ వెళ్లి, ఓటుకు ఆధార్ అనుసంధానం చేస్తున్న బీఎల్‌వోలు

రామభద్రపురం: ఓటరు గుర్తింపుకార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ పి.గణపతిరావు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జరుగుతున్న తీరును ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఓటుకు ఆధార్ అనుసంధానం ద్వారా చనిపోయిన ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగించి, సమగ్రమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా గ్రామ, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆధార్ సీడింగ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బూసాయవలస సచివాలయ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, వీఆర్‌ఓ కె.ఆనందరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.అప్పలరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పొన్నాకుల హారతి



వేంకటేశ్వరస్వామికి హారతి సమర్పిస్తున్న భక్తులు

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పొన్నాకుల హారతి కార్యక్రమం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామికి హారతి సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

బాడంగి: మండలంలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 17 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 6,697 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయి కొనుగోలు పూర్తవుతుందన్నారు. ప్రస్తుతం రబీ పంటలకు చెందిన ఈ–క్రాప్ బుకింగ్ జరుగుతోందన్నారు. పీఎం కిసాన్ యోజన కోసం ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోని రైతులంతా ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

నేడు వావిలవలసలో 'గడపగడపకు..'

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరగనుందని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరు కానున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారు డిక్కీలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్, సీ, ఆర్‌సీ బుక్‌లు పరిశీలించారు. అలాగే వాహనాల్లో ఏమేమి రవాణా చేస్తున్నారో కూడా చెక్ చేశారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేపట్టామని, రామభద్రపురం మండల కేంద్రం అంతర్ రాష్ట్ర కూడలి కావడంతో ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేగిడి: పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. రేగిడిలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందక అనేక మంది ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారలోకి వచ్చిన తరువాత నవరత్నాలను ప్రవేశపెట్టి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు.

పౌరాణిక పోటీలకు 12 బృందాలు ఎంపిక

వంగర: మండల పరిధి రుషింగిలో ఈ నెల 19వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి పౌరాణిక సన్నివేశ పోటీలకు 12 బృందాలను ఎంపిక చేసినట్లు ఆలిండియా కళాకారుల సంఘం ప్రతినిధి యలకల మురళీకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 85 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 12 బృందాలను క్రోడీకరించి ఎంపిక చేసినట్లు మురళీకృష్ణ తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలు చదివించడం, కథలు చదివించడం, చెప్పించడం వంటివి నేర్పించడంతో పాటు క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్స్ క్లబ్ ఆవశ్యకతను వివరించి, ప్రతీ విద్యార్థి చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు. చిన్నతనం నుంచే రామాయణం, మహాభారతం, ఇతిహాస గ్రంథాలు చదవడం ద్వారా మంచి విషయాలు నేర్చుకోవచ్చన్నారు.

దుప్పట్లు, రగ్గులు అందజేత



పేదలకు రగ్గులు అందజేస్తున్న రెడ్డి దామోదరరావు

బొబ్బిలి: వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రెడ్డి దామోదరరావు ఎన్నికైన సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు, రగ్గులు ఆదివారం అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చోడిగంజి రమేష్ నాయుడు, యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ అధ్యక్షుడు మిండి విజయమోహన్‌రావుపాల్గొన్నారు.

ప్రశాంతంగా పండగ జరుపుకోవాలి: సీఐ



సీఐ ఉపేంద్ర

రాజాం: ప్రశాంత వాతావరణంలో భోగి, సంక్రాంతి, కనుమ పండగలు నిర్వహించుకోవాలని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండగ సమయంలో పేకాట, కోడిపందేలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని సూచించారు. సంక్రాంతి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే తిరిగి వచ్చేవరకు వారి ఇంటికి భద్రత కల్పిస్తామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చేయొద్దని సూచించారు.

సేవాభారతిలో సంక్రాంతి సంబరాలు

రాజాం: పట్టణంలోని సేవాభారతి ఆధ్వర్యంలో నడుస్తున్న అభ్యాసిక, బాల సంస్కార కేంద్రాల్లో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగ విశిష్టతను సేవా భారతి ట్రస్ట్ ప్రతినిధి శెట్టి శ్రీనివాసరావు చిన్నారులకు వివరించారు. చిన్నారులు భోగి మంటలు వేసి, హరిదాసుల వేషధారణలో సందడి చేశారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులు పేదకుటుంబాలకు కిరాణా సరుకులు, దుస్తులు అందజేశారు. బాల సంస్కార కేంద్రం శిక్షకులు హిమగిరి, లోహిత పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

- ఎమ్మెల్యే కంబాల జోగులు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాంలోని పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమానంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విదేశీ కంపెనీలతో పెట్టుబడులు పెట్టించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ద్వారా మౌలిక వసతులను కల్పిస్తున్నారని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడంతో పాటు నిరుద్యోగ సమస్యను పరిష్కరించారని అన్నారు. టీడీపీ దత్త పుత్రుడుతో పాటు పచ్చమీడియా చంద్రబాబును సీఎం చేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని వక్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖపట్నం రాజధాని అవుతుందని, ఉత్తరాంధ్ర అభివృద్ధి బాటలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఉన్నారు.

చలికాలం.. ఆరోగ్యం భద్రం!



తెర్లాం: తెర్లాం పట్టణాన్ని కప్పేసిన పొగమంచు

- రోజురోజుకూ పెరుగుతున్న చలితీవ్రత
- ఉదయం, సాయంత్రం దట్టంగా కురుస్తున్న పొగమంచు
- అధికమవుతున్న ఆరోగ్య సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష

రామభద్రపురం: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పాటు చలిగాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు చలితో గజగజ వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో శీతాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి శిరీష చెబుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ చిన్నికృష్ణతో కలిసి ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడం వల్ల చలి బాగా పెరుగుతోందని, చలి తీవ్రతతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండకపోతే వ్యాధుల బారినపడొచ్చని తెలిపారు. జలుబు, జ్వరం రాకుండా చూసుకోవాలని, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వాళ్లు, ఆయాసం, ఇసినోఫీలియా, ఉబ్బసం వ్యాధులతో బాధపడుతున్న వారు మంచులో ఎక్కువగా తిరగకూడదన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నెలల బిడ్డలు, తల్లి పొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి.
- ఏడాది లోపు పిల్లలకు చలిగాలి తగలనీయకూడదు. చలితో చిన్నారులకు ఫిట్స్ వచ్చే అవకావముంది.
- చిన్నపిల్లలతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వస్తే వారి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- ఐదేళ్ల లోపు పిల్లలకు స్వెటర్లు, ఉన్ని దుస్తులు వేయాలి.
- అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పొగమంచుతో ఇక్కట్లు..

తెర్లాం: పట్టణంలో గత కొన్నిరోజులుగా కురుస్తున్న దట్టమైన పొగమంచుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం 7 గంటలైనా మంచు తగ్గకపోవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

తప్పుల్లేని డీఎల్‌ఆర్ తయారు చేయండి



డి.గదబవలస డీఎల్‌ఆర్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే పూర్తయిన మండలంలోని డి.గదబవలస గ్రామానికి చెందిన డీఎల్ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)ను తప్పులు లేకుండా తయారు చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డి.గదబవలస డీఎల్‌ఆర్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన డీఎల్‌ఆర్ తయారు చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూముల రీసర్వేలో డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయిన తర్వాత డీఎల్‌ఆర్ తయారు చేయడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రభుత్వ, బంజరు, పోరంబోకు భూములకు సంబంధించి, డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ తయారు చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆయన వెంట మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

పింఛన్ల అభ్యంతరాలపై విచారణ



బొద్దూరులో పింఛన్లపై విచారణ చేస్తున్న ఎంపీడీఓ

సంతకవిటి: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుకకు సంబంధించిన అభ్యంతరాలపై ఎంపీడీఓ బాసూరీ శంకరరావు ఆదివారం దర్యాప్తు నిర్వహించారు. బొద్దూరు, గరికిపాడు, తాలాడ తదితర గ్రామల్లో పర్యటించి ఇటీవల నోటీసులు పొందిన లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. అర్హత ఉన్నవారికి పింఛన్లు పునరుద్ధరిస్తామన్నారు.



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన జీఎంఆర్ ఐటీ మహిళల జట్టుతో నిర్వాహకులు

ముగిసిన పోటీలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు రోజులుగా జరుగుతున్న జేఎన్‌టీయూ–కే ఇంటర్ కాలేజియేట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రెండో రోజు పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ బహుమతులు అందించారు. మొదటి మూడు స్థానాల్లో సత్తా చాటిన విద్యార్థులు త్వరలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో జేఎన్‌టీయూ–కే తరఫున పాల్గొంటారని ఆయన తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో స్ట్రాంగ్ మెన్‌గా జీఎంఆర్ ఐటీకి చెందిన సీహెచ్ గణేశ్వరరావు, బాడీ బిల్డింగ్ పోటీలలో మిస్టర్ జేఎన్‌టీయూగా సూరంపాలెం ఆదిత్య కళాశాలకు చెందిన బీజీఎస్ఎస్ రామ్‌ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్‌లో స్ట్రాంగ్ మెన్‌గా బీవీసీ కళాశాలకు చెందిన ఎం.వీరభద్ర నిలిచారు. పవర్ లిఫ్టింగ్‌లో మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా జీఎంఆర్ ఐటీ జట్టు ఎంపికైంది. విజేతలను డాక్టర్ జె.గిరీష్, డాక్టర్ శశికుమార్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, కళాశాల సిబ్బంది అభినందించారు.

రాజాం సిటీ: ఈ నెల 9 నుంచి 12 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇటీవల విజయనగరంలోని గురజాడ జీవీలో జరిగిన ఎంపికల్లో కళాశాలకు చెందిన జి.ప్రసాద్, డి.దేవిప్రదీప్, ఎం.అజయ్‌కుమార్, బి.బాలచంద్రకుమార్ అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, డీన్ స్టూడెంట్ ఆఫీసర్ డి.శశికుమార్ అభినందించారు.

22 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి

బాడంగి: మండలంలోని 22 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయినట్లు తహసీల్దారు బాల మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమం ద్వారా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టిందని, ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రైతులు దగ్గరుండి సర్వే చేయించుకుని, భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.